# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-01-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వం అందించే పౌర సేవలన్నీ క్షేత్రస్థాయిలో మరింత మెరుగ్గా అందించేలా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **తెలంగాణలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో భారతీయ సంస్కృతి గురించి యువతకు తెలియజేయవలసిన అవసరం ఉందని గవర్నర్ జిష్టుదేవ్ వర్మ పేర్కొన్నారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసిందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో కిలో గోధుమ పిండి 20 రూపాయలకు అందిస్తున్నామని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

==========================

మారిషస్ అధ్యక్షులు ధరమ్ బీర్ గోకుల్ తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిన్న మర్యాదపూర్వకంగా సమావేశమైయ్యారు. 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన అనంతరం ముఖ్యమంత్రి మారిషస్ అధ్యక్షడితో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి మారిషస్ అధ్యక్షడికి వివరించారు. అలాగే మారిషస్ లో నివసిస్తున్న తెలుగు వారి యోగక్షమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోవా గవర్నర్ “అశోక్ గజపతి రాజుతోనూ” ముఖ్యమంత్రి సమావేశమైయ్యారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే పౌర సేవలన్నీ క్షేత్రస్థాయిలో మరింత మెరుగ్గా అందించేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,కొత్త సంవత్సరంలో ప్రభుత్వ శాఖలన్నీ ప్రజలకు అత్యుత్తమంగా సేవలందించాలని సూచించారు.స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని 50 శాతం మేర ఘన వ్యర్థాలు పునర్వినియోగం కావాలని,.స్వచ్ఛ రథల ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణకు ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ సహా వినూత్న విధానాలను అనుసరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అనంతరం స్వర్ణ గ్రామం- స్వర్ణ వార్డు శాఖ 2026 క్యాలెండర్‌ను మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామితో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

-------------------------

తెలంగాణలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో భారతీయ సంస్కృతి గురించి యువతకు తెలియజేయవలసిన అవసరం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. విద్యామండలి 2025లో ప్రభుత్వ లక్ష్యలు, జాతీయ నూతన విద్యా విధానం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన సంస్కరణలు, పరిపాలనాపరమైన మార్పులు తదితర అంశాలతో రూపొందించిన నివేదికను హైదరాబాద్ లోక్‌భవన్‌లో గవర్నర్‌కు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్నత విద్య, ప్రవేశ పరీక్షలు, కౌన్సెలింగ్ తదితర అంశాల్లో నూతన సంస్కరణలు అమలు చేయడంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ముఖ్య పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసిందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నువ్వూరుపాడు గ్రామంలో నిర్వహించిన మీ భూమి– మీ హక్కు కార్యక్రమంలో పట్టాదారు పాసు పుస్తకాలను మంత్రి నిన్న పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ కృష్ణా, గోదావరి బేసిన్ పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓఎన్జీసీ మోరి–5 బావిలో విస్ఫోటనం కారణంగా గ్యాస్ లీకై నిన్న అగ్నికీలలు చోటుచేసుకున్నాయి. 50 మంది సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు బావిలో పరిస్థితిని నియంత్రించేందుకు శీతలీకరణ కార్యకలాపాలు చేపట్టామని అధికారులు వివరించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి. పవన్ కళ్యాణ్ అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమీప గ్రామాలకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా చూడాలని జిల్లా అధికారులు, ఓఎన్‌జీసీ ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. ఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. గ్యాస్ విస్ఫోటనం కారణంగా ఇప్పటి వరకూ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో కిలో గోధుమ పిండి 20 రూపాయలకు అందిస్తున్నామని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం రామచంద్రపురం వద్ద ఓ మిల్లును మంత్రి నిన్న తనిఖీ చేసి ధాన్యం సేకరణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ,

వాయిస్.. 20 సెకన్లు

-------------------------

విద్యార్థుల సంక్షమం కోసం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ – ఏబీవీపీ కృషి చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. తెలంగాణలోని శంషాబాద్‌లో 3 రోజులపాటు నిర్వహించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 44వ రాష్ట్ర మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన నిన్న ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధితో ముడిపడిన విద్యారంగాన్ని తెలంగాణా ప్రభుత్వం విస్మరిస్తోందని, ఆ రంగాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. మావోయిస్టుల లొంగుబాటు, ప్రక్రియ వచ్చే మార్చిలో పూర్తవుతుందని కేంద్ర మంత్రి వివరించారు.

-------------------------

యుద్ధ అనాథల సంక్షేమ దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు జరుగుతున్న ప్రాంతాలలో అనేక మంది సర్వం కోల్పోయి అనాధలుగా మారుతున్నారు. ఇటువంటి వారి సంక్షేమం కోసం చర్యలు చేపట్టవలసిన అంశం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో 'యుద్ధ అనాథల సంక్షేమ' దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాలలో అనాథ పిల్లల సంక్షేమానికి బాటలు వేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం రష్యా – ఉక్రెయిన్, ఇజ్రాయేల్ – పాలస్తీనాల మధ్య జరుగుతున్న సంఘర్షణలు యుద్ధ అనాథల సంక్షేమ దినోత్సవ నిర్వహణలోని ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి.

-------------------------

విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విజయవాడలో నిర్వహించిన ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ – 2026 డైరీ, క్యాలెండర్‌ను మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ జెన్ కోలో రికార్డు స్థాయిలో 6 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడం రాష్ట్రానికే గర్వకారణ అని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో ఈనెల 12వ తేదీ వరకు చలి తీవ్రత కొనసాగనుంది. దట్టమైన పొగమంచు కురుస్తుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. చలి తీవ్రత కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకులో 10 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. తెలంగాణా సంగారెడ్డి జిల్లాలోని కోహిర్‌లో 11.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

=====================